క్లుప్తంగా

వైఎస్సార్ బీమా అందజేత



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి శాంతి నగర్‌కు చెందిన పాకలపాటి పార్వతి ఈ నెల 11వ తేదీన తన కుమారుడి బైక్‌పై వెళుతూ ప్రమాదవశాత్తు కారు ప్రమాదంలో మృతి చెందింది. సచివాలయ ఉద్యోగులు ఆమెకు వైఎస్సార్ బీమా పథకం అమలునకు ఆన్‌లైన్ చేయగా తక్షణమే మంజూరైంది. మట్టిఖర్చుల నిమిత్తం ఒకటో వార్డు కౌన్సిలర్ మండే చంద్రశేఖర్, సచివాలయ ఉద్యోగి రాహుల్ మృతురాలు కుటుంబ సభ్యులకు రూ.10వేలు మంగళవారం అందజేశారు. మిగిలిన రూ.4.90 లక్షలు మరణ ధ్రువీకరణ పత్రాలు అందజేసిన అనంతరం మంజూరు అవుతాయని పేర్కొన్నారు.

ఏడు వేల మందికి ఉపాధి



గంపలగూడెం: ఉపాధి హామీ పథకంలో మంగళవారం మండలంలోని ఏడువేల మంది కూలీలకు ఉపాధి చూపినట్లు ఎన్ఆర్‌జీఈఎస్ ఏపీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీలలో నిర్వహించిన 337 పనులలో 725 శ్రమశక్తి సంఘాల నుంచి కూలీలు పనులలో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. మండలంలోని అమ్మిరెడ్డిగూడెం, మేడూరు, పెద్దకొమిర, వినగడప గ్రామాల్లో అమృత సరోవర్ పథకంలో చెరువుల అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ కూలీలు రోజువారి కనీస వేతనం పడేలా క్షేత్ర సహాయకులు చూపిన నిర్దిష్ట పనిని కచ్చితంగా చేయాలన్నారు.

గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు ప్రారంభం



తిరువూరు: మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు సబ్ రిజిస్ట్రారు కార్యాలయం సూచనల ననుసరించి సచివాలయ కార్యదర్శులు దస్తావేజుల రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి దస్తావేజును మంగళవారం వామకుంట్ల గ్రామ సచివాలయంలో చేసి అర్జీదారుడికి అందజేసినట్లు తెలిపారు.

రేపు సచివాలయ భవనం ప్రారంభం



ఏ.కొండూరు: మండలంలోని చీమలపాడు గ్రామంలో రూ.40లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఈ నెల 15వ తేదీన స్థానిక ఎమ్మెల్యే కే రక్షణనిధి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు సర్పంచ్ మోర్ల లక్ష్మీ మంగళవారం తెలిపారు. సచివాలయంలో అన్ని వసతులు కల్పించి అన్ని హంగులతో నిర్మాణం పూర్తి చేశారు.

సుబ్బారాయుడికి వెండి కిరీటాలు, పాదాలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొత్తపేట ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి హైదరాబాద్‌కు చెందిన పొత్తూరి కిరణ్‌కుమార్ కుటుంబం పలు వెండి వస్తువులను బహూకరించారు. రెండు వెండి కిరీటాలు, వెండి పాదాల జత తదితర వస్తువులు అందించారు. వాటికి సంప్రోక్షణ చేసిన అర్చకులు స్వామి వారి ధ్రువమూర్తులకు అలంకరించారు. మొత్తం 1,143 గ్రాముల వెండితో తయారు చేసిన వస్తువులను స్వామి వారికి అందించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. దాత కుటుంబానికి ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్వీ సుబ్బారావు స్వామి వారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు.

16న నీలకంఠేశ్వరునికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ఈనెల 16వ తేదీ శుక్రవారం మాసశివరాత్రి సందర్భంగా శ్రీధర్మపరిషత్ మహాసంస్థాన్ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ.25 కోట్ల మంజూరు

- భూ సేకరణ పనులు పూర్తి
- ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు

నూజివీడు: నూజివీడు పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తెలిపారు. స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తారురోడ్డును 4.30 కిమీ పొడవునా, 10 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తామని, దీనికి 22.50 ఎకరాలు భూమిని సేకరిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే భూసేకరణ నోటిఫికేషన్‌ను విడుదల చేశామన్నారు. మైలవరం రోడ్డు నుంచి విస్సన్నపేట రోడ్డు వరకు నిర్మించనున్న ఈ బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తయితే పట్టణంలోని ట్రాఫిక్ పూర్తిగా తగ్గిపోతుందని వివరించారు. లారీలు, కారులు, ఇతర వాహనాలన్నీ బైపాస్ రోడ్డులో హనుమాన్ జంక్షన్ వైపునకు వెళ్తాయన్నారు. ఈ మార్గంలో బిల్లుడు వాగుపై ఒక వంతెనతో పాటు మరో రెండు కల్వర్టులు నిర్మిస్తారని తెలిపారు. బైపాస్ రోడ్డు నిర్మాణం వల్ల ప్రాంతంలోని భూముల రేట్లకు రెక్కలొచ్చాయన్నారు. దీంతో రైతులకు ఎంతోమేలు చేకూరుతుందని చెప్పారు.



ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

'కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కృషి'

పట్టణంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి ఎనిమిది చోట్ల కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు వెళ్లాయని తెలిపారు. గత నాలుగేళ్లుగా కేంద్ర ప్రభుత్వం దక్షిణ భారతదేశంలో ఒక్క కేంద్రీయ విద్యాలయాన్నీ మంజూరు చేయలేదన్నారు. అయినా పట్టు విడవకుండా ఇప్పటికే రెండు సార్లు ఢిల్లీ వెళ్లి వచ్చామని, వారం రోజుల్లో మరోసారి ఢిల్లీ వెళ్తున్నానని తెలిపారు. ఇప్పటికే కేంద్రీయ విద్యాలయం కోసం రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి ట్రిపుల్ ఐటీ వద్ద ఏడెకరాల భూమిని కేటాయించామన్నారు. కేంద్రీయ విద్యాలయానికి ప్రతిపాదనలు పంపేందుకు ఎంప్లాయీస్ కాలనీలోని పాత పాఠశాలను రూ.80 లక్షలతో అభివృద్ధి చేసి 16 తరగతి గదులను సిద్ధం చేసి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. నందిగామలో కూడా ఇదే విధంగా పంపించారని, కేంద్ర ప్రభుత్వం వివక్షత చూపకుండా మంజూరు చూస్తే వెంటనే కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

ఘనంగా వేణు గోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం

లోపూడి (ముసునూరు): స్థానిక వేణు గోపాల స్వామి ఆలయానికి భక్తులు సంప్రదాయ సిద్ధంగా, భక్తిశ్రద్ధలతో ద్వితీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లోపూడిలో రెండేళ్ల క్రితం నిర్మించిన రాధమ్మ సమేత శ్రీకృష్ణుని ఆలయంలో మంగళవారం గణపతి పూజ, పుణ్యావచనం, పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల గోపాల నామస్మరణ, పురోహితుల వేద మంత్రోచ్ఛారణలు, బాజా భజంత్రీల మంగళవాయిద్యాల నడుమ స్వామి వారికి ప్రధానార్చకులు కిరణ్‌కుమార్, రాజా ఘనంగా శాంతి కల్యాణం నిర్వహించారు. గ్రామంలోని ప్రముఖులు, ఆలయ కమిటీలకు చెందిన ఐదుగురు దంపతులు పెళ్లి పీటలపై కూర్చుని స్వామి వారి కల్యాణ క్రతువు జరిపించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాటం, భజనలు ఆకట్టుకున్నాయి. అనంతరం వెయ్యి మంది భక్తులకు అన్నసమారాధన ఏర్పాటుచేశారు.



లోపూడిలో వేణుగోపాల స్వామి కల్యాణ మహోత్సవం

బాల్య దశలో ప్రేరణలే వ్యక్తిత్వ వికాసానికి తోడ్పాటు

సీడీపీఓ పుష్పలత

మొర్సుమల్లి(మైలవరం): బాల్యదశలో కలిగించే ప్రేరణలే మనిషి వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడతాయని సీడీపీఓ పుష్పలత తెలిపారు. ఐసీడీఎస్ ప్రాజక్టు పరిధిలో మైలవరం మండలం పుల్లూరు సెక్టార్ లోని మొర్సుమల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో జన భాగీదారీ కార్యక్రమం మంగళవారం జరిగింది. గ్రామ సర్పంచ్ మాడపాటి రమాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీడీపీఓ మాట్లాడారు. పిల్లల జీవితాలు మొదటి ఆరు సంవత్సరాలు అత్యంత విలువైనవన్నారు. మూడేళ్ల వరకు తల్లి ఒడికి, ఇంటికి పరిమితమైన పిల్లలు తరువాత బయటి ప్రపంచాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం మొదలు పెడతారన్నారు. ఈ వయసులో చూసిన, విన్న అంశాల ఆధారంగా బుద్ధిని, తెలివి తేటలను వికసింపజేసుకుంటారన్నారు. పూర్వ ప్రాథమిక విద్యను పిల్లలకు ఇష్టమైన ఆటపాటలు, కథల ద్వారా వారి మనస్సుకు హత్తుకునేలా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించడం జరుగుతుందన్నారు. ఈ ప్రభావం పిల్లల ప్రాథమిక స్థాయిలోనే కాక ఉన్నత స్థాయిలో కూడా విద్యా ప్రమాణాలు అందుకునేందుకు తోడ్పడుతుందన్నారు. ఐదేళ్ల వరకు అంగన్‌వాడీల్లో పిల్లలు ఉండాలన్నారు. సర్పంచ్ మాడపాటి రమాదేవి మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపైనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ షేక్ గౌసియా బేగం, రాణి, ఏఎన్ఎం రాజేశ్వరి, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: మండలంలోని కూనపరాజుపర్వ పంచాయతీలో అంగన్‌వాడీ సెంటర్ 164లో జనభాగీదారీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రజా ప్రతినిధులు, కుటుంబ సభ్యులు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్‌కే మజిదాబేగం పాల్గొన్నారు.

తుమ్మలపాలెంలో..

తుమ్మలపాలెం(ఇబ్రహీంపట్నం): అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారుల వ్యక్తిత్వ వికాసం, సమగ్రాభివృద్ధికి దోహద పడతాయని ఈలప్రోలు సెక్టార్ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. మండలంలోని 68 అంగన్‌వాడీ కేంద్రాల్లో కేంద్ర విద్యావిధానం 2020 అమలులో భాగంగా జన భాగీధారీ కార్యక్రమం ద్వారా వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే అంశాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు పూర్వ ప్రాథమికవిద్య ఇష్టమైన ఆటపాటలు, కథల ద్వారా అందుతుందన్నారు. సమాజం, తల్లిదండ్రుల ప్రవర్తన పిల్లల శారీరక మానసిక, వ్యక్తిత్వ వికాసంపై ప్రభావం చూపుతాయన్నారు.



మొర్సుమల్లిలో చిన్నారులకు ఆటవస్తువులు అందజేస్తున్న సర్పంచ్ రమాదేవి, సీడీపీఓ పుష్పలత



చిన్నారుల వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రమాదేవి

జాతీయ స్థాయి యోగా పోటీల్లో కేబీఎన్ ప్రతిభ



యోగాలో ప్రతిభ చూపిన వారిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేబీఎన్ కళాశాల యోగా విభాగం జాతీయ స్థాయిలో నిర్వహించిన పలు పోటీల్లో అద్భుతమైన ప్రతిభను కనబరిచి పలు బహుమతులను సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. ఇటీవల ఒడిశాలోని కటక్‌లో ఇండియా నేషనల్ యోగా స్పోర్ట్స్ జాతీయ స్థాయి యోగా పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అందులో తమ యోగా విభాగ ట్రైనర్ ఎం.రాజేష్ జాతీయ స్థాయిలో రజత పతకాన్ని సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు ఎస్.వెంకటేశ్వరమ్మ ఆరో స్థానాన్ని, పి.పద్మావతి ఎనిమిదో స్థానాన్ని పొందారని పేర్కొన్నారు. ప్రతిభ చూపిన ట్రైనర్‌ను, విద్యార్థులను, అధ్యాపకులను హేమచంద్రరావు, ఎన్ సాంబశివరావులను హిందూహైస్కూల్స్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిట్టూరి ఆనంద రామసుధాకర్, గోపిశెట్టి మల్లయ్య, కోశాధికారి గోళ్ల బాబా విజయకుమార్, కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు, కోశాధికారి అన్నం రామకృష్ణారావు అభినందించి సత్కరించారు.

బాలికల గురుకులంలో జేవీకే పంపిణీ

ముసునూరు: జగనన్న విద్యా కానుకల పంపిణీతో పేద విద్యార్థులకు మేలు కలుగుతోందని జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్ పేర్కొన్నారు. స్థానిక ఆంధ్రప్రదేశ్ బాలికల గురుకుల విద్యాలయంలో మంగళవారం సాయంత్రం ప్రిన్సిపాల్ యార్లగడ్డ శ్రీదేవి అధ్యక్షతన విద్యార్థినులకు 414 మందికి విద్యాకానుక అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆర్ కృష్ణకుమారి సుబ్బారావు, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, సర్పంచ్‌లు కె.విజయలక్ష్మి, పిల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

18న ఏలూరులో బీజేపీ బహిరంగ సభ

నూజివీడు: ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల సుపరిపాలనలో చేపట్టిన అభివృద్ధి పథకాలు, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు వివరించేందుకు ఈ నెల 18వ తేదీన ఏలూరులో బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్టు ఆ పార్టీ ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ తెలిపారు. నూజివీడులో జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లిపూడి రాజశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పార్టీ నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సభలో కేంద్ర మంత్రులు, జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర, జిల్లా పార్టీ ఆదేశాల మేరకు ఈ నెల 21 నుంచి గృహ సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని బూత్ స్థాయిలో ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లిపూడి రాజశేఖర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బోను అప్పారావు, జిల్లా కార్యదర్శి శివరాజు వసుంధరదేవి పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ఊటుకూరు(గంపలగూడెం): గంపలగూడెం మండలం ఊటుకూరు సచివాలయం-1 పరిధిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరువూరు: వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాల్లో చేరేందుకు మూడో తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తిరువూరు బీసీ వెల్ఫేర్ హాస్టల్ వార్డెన్ హనుమాన్ నాయక్ తెలిపారు. ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో హాస్టల్ బాట కార్యక్రమం నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులకు హాస్టళ్లలో వసతుల గురించి అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

పేదలను విద్యావంతులను చేయడమే లక్ష్యం

చిలుకూరువారిగూడెం(మైలవరం): పేద పిల్లలను విద్యావంతులను చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని మైలవరం ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి తెలిపారు. మైలవరం మండలం చిలుకూరువారిగూడెం ఎస్ఏఎస్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న విద్యా కిట్లను విద్యార్థులకు అందజేశారు. మైలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి, సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి, జెడ్పీటీసీ సభ్యుడు తిరుపతిరావు పాల్గొన్నారు.

బీసీలు వేలాదిగా తరలిరండి

ముసునూరు: విజయవాడలో బుధవారం నిర్వహించే బీసీ కులాల ఆత్మీయ సమావేశానికి వేలాదిగా బీసీలు తరలిరావాలని నూజివీడు నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షుడు తులిమెల్లి రంగారావు పిలుపునిచ్చారు. ముసునూరులో మంగళవారం ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు హోటల్ ఐలాపురం సమీపంలోని రామా ఫంక్షన్ హాల్లో నిర్వహించే బీసీల ఐక్య ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

నూజివీడు: నూజివీడు మండలం జంగంగూడెంలో అభయాంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాలన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితులతో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వల్లభనేని వీరభద్రయ్య, రాధాదేవి దంపతులు గ్రామ సర్పంచ్ పొట్లూరి అంజనీ కుమారి, అశోక్ దంపతులు కల్యాణ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

మాజీ సైనికోద్యోగి అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మాజీ సైనికోద్యోగి అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు... భవానీపురానికి చెందిన మచ్చ కృష్ణారావు ఆర్మీలో పనిచేసి రిటైర్ అయ్యారు. ప్రతినెలామిలిటరీ క్యాంటిన్(కొత్త గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర)కు వెళ్లి సరుకులు తీసుకుని వస్తుంటారు. ఆయనకు గత కొంతకాలంగా మానసిక పరిస్థితి బాగా లేదు. ఈ నెల 10వ తేదీ ఉదయం 11 గంటల సమయంలో క్యాంటిన్‌కు బయలుదేరాడు. ఆయన కుమార్తె హసిని క్యాంటిన్‌కు వెళ్లడానికి స్వాతీ సెంటర్‌కు పంపించి వచ్చింది. క్యాంటిన్‌కు వెళ్లిన కృష్ణారావు రాత్రి 10 గంటలు దాటినా తిరిగి రాలేదు. బంధువులు, తెలిసిన వారిని అడిగినా ఆయన ఆచూకీ తెలియలేదు. దీనిపై కృష్ణారావు కుమారుడు రమేష్ బాబు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



ముసునూరులో ఇంటింటా ప్రచారం చేస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ముసునూరు: అన్ని అర్హతలున్న ఉపాధ్యాయులు బోధించే ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని హైస్కూల్ హెచ్‌ఎం ఎ.సునీల పేర్కొన్నారు. ముసునూరులో హైస్కూల్ ఉపాధ్యాయులు మంగళవారం ఇంటింటికీ ప్రచారం నిర్వహించి, బడి ఈడు బాలలను గుర్తించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ముసునూరు హైస్కూలులో ఇంటర్మీడియట్ విద్యను కూడా బోధిస్తున్నామని తెలిపారు. పదో తరగతి పాసైన స్థానిక విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్రీడా కేంద్రంగా నూజివీడును తీర్చిదిద్దుతాం

- రూ.1.40 కోట్లతో క్రికెట్ గ్రౌండ్ అభివృద్ధి
- ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



నూజివీడులో క్రికెట్ గ్రౌండ్ అభివృద్ధిపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

నూజివీడు: స్థానిక విస్సన్నపేట రోడ్డులోని గురుకుల పాఠశాల సమీపంలో ఉన్న స్టేడియం గ్రౌండ్‌ను రూ.1.40 లక్షలతో క్రికెట్ గ్రౌండ్‌గా అభివృద్ధి చేయనున్నట్టు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తెలిపారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆర్అండ్‌బీ ఏలూరు ఎస్ఈ జి.జాన్‌మోషే, స్థానిక డీఈ సీహెచ్ బాబూరావుతో ఎమ్మెల్యే మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం రూ.2 కోట్లు విడుదల చేసిందని, వారం రోజుల్లో గ్రౌండ్ అభివృద్ధికి టెండర్లు పిలవనున్నట్లు ఎమ్మెల్యే ప్రతాప్ తెలిపారు. రూ.1.40 కోట్లతో గ్రౌండ్‌ను లెవెలింగింగ్, గ్రాస్ ఏర్పాటు, పిచ్ తయారీ, గ్రౌండ్ చుట్టూ లింక్ మెస్ ఏర్పాటు చేస్తామన్నారు. దీంతో ఈ గ్రౌండ్‌లో రంజీమ్యాచ్‌లతో పాటు పెద్ద టోర్నమెంట్లను నిర్వహిస్తామని చెప్పారు. రాబోయే కాలంలో పెవిలియన్ బిల్డింగ్‌తో పాటు చుట్టూ గ్యాలరీని నిర్మిస్తామన్నారు. తద్వారా క్రికెట్ క్రీడాకారులకు రాష్ట్రస్థాయి ప్రమాణాలతో కూడిన క్రికెట్ గ్రౌండ్‌ను రాబోయే ఆరునెలల్లో అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. నూజివీడు స్టేషన్‌తోటలో ఉన్న 5.26 ఎకరాల ఆట స్థలాన్ని మల్టీ పర్పస్ క్రీడా స్థలంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇక్కడ వాలీబాల్, షటిల్, బాల్ బ్యాడ్మింటన్ కోర్టులతో పాటు క్రికెట్ నెట్ ప్రాక్టీస్ వంటి సదుపాయాలను కల్పిస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో నూజివీడు పట్టణాన్ని జిల్లాలో క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు వివరించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, ఆర్అండ్‌బీ ఏఈ అశోక్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ఏపీసీపీడీసీఎల్ డీఈ ఓలేటి దుర్గారావు పాల్గొన్నారు.

ఎల్‌బీఆర్‌సీఈ అధ్యాపకుడికి పీహెచ్‌డీ ప్రదానం

మైలవరం: స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం అధ్యాపకుడు బీ.వీ.ఎస్.ఆర్. శివకుమార్ పీహెచ్‌డీ అవార్డు అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు మంగళవారం తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌లోని అమిటీ యూనివర్సిటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో ఇన్వెస్టిగేషన్స్ ఆన్ లోయర్ లింబ్ ఎక్సో స్కెలిటన్స్ ఫర్ ప్రోస్థటిక్ అండ్ రెహాబిలిటేషన్ అప్లికేషన్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు తెలిపారు. ఈ పరిశోధనను డాక్టర్ రాఘవేంద్ర శర్మ, ప్రొఫెసర్ ఆఫ్ ఈసీఈ, అమిటీ యూనివర్సిటీ, హైదరాబాద్ జేఎన్‌టీయూ, ఈసీఈ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ డి. శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిందన్నారు. ఈ పరిశోధనలో పెరాలసిస్, స్పైనల్‌కార్డు ఇంజ్యూరీ పేషంట్స్‌ని యథాస్థితికి తీసుకురావడానికి ఇండియాలో మొదటి సారిగా ఒక ఎక్సో స్కెలెటన్ మోడల్‌ని డెవలప్ చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఏ అమర్‌బాబు, అధ్యాపకులు అభినందించారు.



అధ్యాపకుడు శివకుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు

విద్యాభివృద్ధికి అనేక పథకాల అమలు

జెడ్పీటీసీ లోకేశ్వరరెడ్డి

విస్సన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం పేదల విద్యాభివృద్ధికి అనేక పథకాలు అమలు చేస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్, నరసాపురం జిల్లాపరిషత్ హైస్కూల్‌లో జగనన్న విద్యాకానుక కిట్లు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభంనాటికే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందజేయడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, వైస్ ఎంపీపీ రెడ్డిశ్రీనివాసరావు, సర్పంచ్ నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



విద్యాకానుక కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ మెర్సీవనజాక్షి

రక్తదాతలూ.. సలాం!

నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

నూజివీడు: గొంతు ఎండిపోతుంటే నీటి చుక్కను కూడా ఉచితంగా ఇవ్వని నేటి సమాజంలో, అపరిచిత వ్యక్తి ప్రాణం నిలబెట్టడానికి తాము రక్తాన్ని దానం చేసేందుకు ఎళ్లవేళలా ముందు వరుసలో ఉంటున్నారు పలువురు దాతలు. వీరిలో నూజివీడు ట్రాఫిక్ ఎస్సై శాగం రాధాకృష్ణారెడ్డి ఒకరు. వృత్తి ప్రభుత్వ ఉద్యోగం కాగా, ప్రవృత్తిగా రక్తదానం చేస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

45 సార్లు రక్తదానం

నూజివీడు ట్రాఫిక్ ఎస్సై శాగం రాధాకృష్ణారెడ్డి పోలీస్ శాఖలో ఉద్యోగంలో చేరి 38 సంవత్సరాలు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో 34 సార్లు బయట మరో 11 సార్లు కలిపి మొత్తం ఇప్పటి వరకు 45 సార్లు రక్తదానం చేసి శభాష్ అనిపించుకుంటున్నారు. పోలీస్ ఉద్యోగంలో చేరిన తొలి నాలుగేళ్లు మినహా ప్రతి ఏటా పోలీసు అమర వీరుల వారోత్సవాల్లో నిర్వహించే రక్తదాన శిబిరంలో రక్తదానం చేస్తూనే ఉన్నారు. ఆయన వయస్సు 58 సంవత్సరాలు. అయినప్పటికీ రక్తదాన శిబిరాల్లో ముందుండి రక్తదానం చేశారు. రక్తదానం అనేది ఆయనకొక్కడికే పరిమితం కాకుండా పోలీస్‌శాఖలో తోటి ఉద్యోగులను చైతన్యపరుస్తూ.. రక్తదానం చేయిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.



శాగం రాధాకృష్ణారెడ్డి

రైల్వే బ్రిడ్జి వద్ద సుందరీకరణకు చర్యలు

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలో రాజీవ్ గాంధీ పార్క్ సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద విద్యుత్ దీపాలు, ప్రహరీ నిర్మాణం, సుందరీకరణ చర్యలు తీసుకోవాలని, డిజైన్ వాల్ నిర్మించాలని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఆయన అధికారులతో కలిసి మంగళవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. హనుమాన్‌పేటలో వెహికల్ డిపో సమీపంలోని రైవస్ కాలువను పరిశీలించారు. ఆ ప్రాంతంలో గ్యాంగ్ వర్కర్లతో చెత్త, వ్యర్థాలను పూర్తి స్థాయిలో తొలగించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని చీఫ్ మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. అదే ప్రాంతంలోని పలు అంతర్గత రోడ్లలో పారిశుద్ధ్య నిర్వహణ, డ్రెయిన్లలో మురుగు పారుదల పరిశీలించి పలు సూచనలు చేశారు. మైక్రో ప్యాకెట్‌తో సిబ్బంది ద్వారా ఇంటింటి చెత్త సేకరణ, సీ అండ్ జీ వాహనాల పని తీరును పరిశీలించి ఇళ్లలో మూడు బిన్ల ద్వారా చెత్తను వేరు చేస్తున్నదీ లేనిదీ స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది విధిగా చెత్తను విభజించి సేకరించాలని చెప్పారు. కృష్ణలంక 22వ డివిజన్ పరిధిలోని బియ్యం కొట్ల బజార్‌లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సైడు డ్రెయిన్లలో ఎప్పటికప్పుడు పూడిక తీయాలని, ధ్వంసమైన డ్రెయిన్లకు తక్షణమే మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలు, వార్డ్ సచివాలయాల ద్వారా అందుతున్న సేవలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. కార్యక్రమంలో ఎస్ఈ రామమోహన్‌రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఏఎస్ఎన్ ప్రసాద్, వి.చంద్రశేఖర్, ప్రజారోగ్య శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.